క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పూజలు

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో ఉన్న వీరహనుమాన్ ఆలయం వద్ద నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి వైభవోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. లలితాసహస్ర కుంకుమార్చనలు, తులసీదళ పూజలు, దీపారాధన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పీవీఆర్‌ఎస్‌ఎన్ ఆచార్యులు, పీవీఎస్‌ఆర్ ఆచార్యులు, కమిటీ సభ్యులు రామ్‌కుమార్ రత్తావ్, సీమకుర్తి ప్రసాదరావు, కొత్తా శ్రీనివాసరావు, కొల్లా పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వేకు సహకరించాలి


ఎంపీడీఓకు వివరాలు వెల్లడిస్తున్న ఎంఈఓలు

రేగిడి: గ్రామాల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే శతశాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ శ్యామల కుమారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం జీఈఆర్ సర్వేకు సంబంధించి ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలతో ఎంపీడీఓ మాట్లాడారు. సర్వే నెమ్మదిగా జరుగుతోందని, వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు సహకరిస్తే సర్వే వేగవంతం అవుతుందని ఎంఈఓలు అన్నారు. వారంతా సర్వేకు సహకరించేలా చూడాలని ఎంపీడీఓను కోరారు.

నేడు రా.ర.వే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 22న రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించనున్నట్లు వేదిక నిర్వాహకులు గార రంగనాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో కేంద్రసాహిత్య అకాడమీ భాషాసమ్మాన్, వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం రచించిన శమంతకమణి ప్రబంధంపై ఒమ్మి రమణమూర్తి ముఖ్యప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రచయితలు, కవులు, భాషాభిమానులు హాజరుకావాలని కోరారు.

నిబంధనలు పాటించని వారికి నోటీసులు


గొల్లపల్లిలో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గొల్లపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటి చెత్త సేకరణ, తదితర అంశాలను పరిశీలించారు. అలాగే అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను పరిశీలించి, యజమానులకు నోటీసులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

సారాతో జీవితాలు నాశనం


హొంజరాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ పోలీసులు

సంతకవిటి: సారాతాగడం వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయని, జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఈబీ ఎస్సై ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని హొంజరాం గ్రామంలో శనివారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. సారాకు తాగడం వలన అర్ధాయుస్సుతో తనువు చాలిస్తారని వివరించారు. రాజాం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ ఆదేశాల మేరకు పరివర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పంచాయతీ పెద్దలు, యువతతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

దోమపోటుపై అప్రమత్తం


మాట్లాడుతున్న ఏఓ కన్నబాబు

వంగర: వరిపంటను ఆశించే దోమపోటుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని మద్దువలస పంచాయతీ జగన్నాథవలసలో శుక్రవారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంట వెన్నుదశలో ఉన్నందున దోమపోటు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమపోటు లక్షణాలు గుర్తించిన వెంటనే ఎస్పేట్ మందును ఒక లీటరు నీటిలో రెండు గ్రాముల మందు కలిపి ఎకరాకు 300 గ్రాముల మందును పిచికారి చేయాలన్నారు. దోమపోటు ఎక్కువగా ఉంటే పైమెట్రోజిన్ మందును ఒక లీటరుకు 0.5 గ్రాములు చొప్పున కలిపి ఎకరాకు 100 గ్రాముల మందును పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మజ, రైతులు పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం...

ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యం.. అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను బలోపేతం చేయడంతో పాటు పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు 24 గంటలూ వైద్యం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రజలకు ఇళ్ల వద్దే వైద్యం అందించాలనే ఉద్దేశంతో తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిష్ణాతులైన వైద్యులు గ్రామాలకు వచ్చి ప్రజలను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేస్తున్నారు. మెరుగైన వైద్యం అందాల్సిన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీలో భాగంగా రిఫరల్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి, మందులు అందజేశారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్


తెర్లాం: కొరటాంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, సర్పంచ్‌లు


తెర్లాం: కొరటాంలో రోగికి కేస్‌షీట్ అందిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్‌లు


బొబ్బిలి : అలజంగిలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రవికుమార్


రేగిడి: సంకిలిలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైస్ ఎంపీపీలు


బాడంగి: ముగడలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


రాజాం: కంచరాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, తదితరులు


వంగర: సంగాంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు


సంతకవిటి: తాలాడలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సన్యాసినాయుడు, తదితరులు

ప్రతీ గడపలో సంక్షేమ సంతకం


సంతకవిటి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రతీ గడపలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ సంతకాలు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని వాల్తేరు గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ లబ్ధిపత్రం అందించి అందులో ఉన్న పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, రాష్ట్ర ఖజానాను దోచుకోవడమే లక్ష్యంగా పనిచేసిందని ఆరోపించారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాయ మాటలు చెబుతూ ప్రజల్లోకి వస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని కోరారు. టీడీపీని నమ్మి ఓట్లు వేస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందని ప్రజలు గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించి, ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యూత్ ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆవిష్కరించారు. రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని, యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైస్ ఎంపీపీలు గురుగుబెల్లి పావని, పండు పాపారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ గురుగుబెల్లి గవరయ్య, స్థానిక సర్పంచ్ గురుగుబెల్లి చిన్నమ్మడు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, పలు పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

● ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు


వలంటీర్ నాగమణికి నియామకపత్రం అందజేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా వలంటీర్‌గా నియమితులైన నడుపూరి నాగమణికి ఎంపీడీఓ రమామణితో కలిసి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రతి ఒక్క ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సు ఉన్నవారికి మాత్రమే పథకాలు అందేవని.. నేడు అర్హత ఉంటే చాలు రాజకీయాలకతీతంగా పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అర్హులందరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దర్రు పైడిరాజు, పత్తిగుళ్ల ఏక్‌నాథ్, కనిమెరక అప్పారావు, మరడ అప్పారావు, బెవర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

■ దుర్గమ్మా నమోస్తుతే..

శరన్నవరాత్రుల సందర్భంగా వాడవాడలా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించడంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్


బొబ్బిలి: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బాల త్రిపురసుందరిగా దర్శనమిస్తున్న అమ్మవారు


రాజాం: దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు


రేగిడి: తాటిపాడులో లక్ష తులసీదళార్చన, కుంకమార్చనలో పాల్గొన్న భక్తులు


బొబ్బిలి: గొల్లపల్లిలో వెలసిన అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, తదితరులు


తెర్లాం: అరసబలగలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపం వద్ద కుంకుమ పూజలకు హాజరైన మహిళలు

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన నూతన ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఆదిమూలం సాయిశ్రీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓ కార్యాలయ అధికారులు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కార్యాలయ సిబ్బంది, ప్రజల సహకారంతో మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

శేషశైలజకు వీడ్కోలు..

ఇంతవరకు ఆర్డీఓగా పనిచేసిన పి.శేషశైలజకు సిబ్బంది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన విశ్వవిద్యాలయానికి 560 ఎకరాల భూములను నిర్దేశించిన సమయంలో సేకరించి అప్పగించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అలాగే డివిజన్‌లో భూముల రీసర్వేను ఎక్కువ గ్రామాల్లో పూర్తి చేశామన్నారు.

అమర వీరులకు నివాళులు..


బాడంగి: పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ర్యాలీ


రామభద్రపురం: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్సై సురేంద్రనాయుడు, తదితరులు

బాడంగి: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమర వీరులకు సిబ్బంది, ప్రజానీకం నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం స్థానిక హెచ్‌సీ డి. కొండలరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ప్రధాన కూడలి వరకు సాగిన ర్యాలీలో అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ప్రధాన కూడలిలో కొద్దిసేపు పోలీస్ అమరవీరులైన ముద్దాడ గాంధీ, చిరంజీవులు, శ్రీరాములు, తదితరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ర్యాలీలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో..

రామభద్రపురం: మండలకేంద్రంలో సీఐ తిరుమలరావు, ఎస్సై సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీ సేవలు మరువం.. మీ ఆశయాలు విస్మరించం.. శాంతియుత సమాజం కోసం అహర్నిశలూ పోరాడుతూనే ఉంటాం అని నినదించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఎస్సై అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సుందరకాండ పారాయణం

రాజాం: పట్టణంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ–ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో గొల్లల ములగాంకు చెందిన కళాకారుడు రేజేటి రామకృష్ణ శర్మ బృందంతో సుందరకాండ పారాయణం నిర్వహించారు. అనంతరం కళా బృందాన్ని ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో ఈఓ బీవీ మాధవరావు, ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నేరం


ఆర్డీఓ పి. శేషశైలజను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

బొబ్బిలి: ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం నేరమని ఆర్డీఓ పి. శేషశైలజ అన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు, ఆడపిల్లల పట్ల వివక్ష స్కానింగ్ పట్ల ఆసక్తి కలిగేలా చేస్తున్నాయన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. స్కానింగ్‌లు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఆర్డీఓ శేషశైలజను వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గుల్ల సంతోషికుమారి, ప్రోగ్రాం అధికారి ఎస్. పద్మావతి, వైద్యులు ఎం. స్వాతి, ఎం. జగన్నాథరావు, పీపీ వి. చిన్నతల్లి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. రాజ్యలక్ష్మి, దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈఓ ఎల్. శాంతి, ఎం. చాముండేశ్వరి, పవన్, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై ట్రైనీ మాస్టర్ కిరణ్‌కుమార్ శనివారం అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు వినియోగించే జిల్లేడు ద్రావణం, తూటికాడ కషాయం, ఘన, ద్రవజీవామృతాల తయారీ, వినియోగాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులను ప్రదర్శించారు.

అ'పూర్వ' కలయిక


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం వంగర మండలం కొప్పర జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. పాఠశాలలో 1990–95 మధ్య చదువుకున్న విద్యార్థులు 28 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని సందడిగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి, ఆర్థికంగా వెనుకబడిన స్నేహితులకు చేయూతనివ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు విశ్రాంత హెచ్‌ఎం జి.సత్యనారాయణనాయుడు, మాచర్ల హరినారాయణ, ముద్రాపు అప్పలస్వామి, గుంటముక్కల శ్రీరామ్మూర్తి, సత్తారు ఆనందరావు, కె.విజయలక్ష్మి, మార్కండేయులు, రౌతు కృష్ణంనాయుడులను ఘనంగా సత్కరించారు.

ఆరు అడుగుల కర్రపెండలం


కర్రపెండలం దుంపను చూపుతున్న రైతు

వంగర: మండల పరిధి ఇరువాడ గ్రామంలో ఆరు అడుగుల కర్రపెండలం లభ్యమైంది. గ్రామానికి చెందిన రైతు పెద్దింటి కామినాయుడు తన పొలంలో శనివారం పంటను తవ్వాడు. పొడవైన పెండలం దుంపను చూసి అవాక్కయ్యాడు. దీనిని ఇరుగుపొరుగు రైతులు ఆసక్తిగా తిలకించారు. ఇంత పొడవైన దుంపను ఎన్నడూ చూడలేదని తెలిపారు.